సాక్షి
తిరుపతి

గురువారం । 3 । అక్టోబర్ । 2024



పచ్చనేతల భూమేత!
చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో టీడీపీ నేతలు యథేచ్ఛగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారు. - 8లో



కోలాహలం.. జెండా ఉత్సవం
గూడూరు పట్టణంలో బుధవారం కోలాహలంగా జెండా ఉత్సవం ప్రారంభమైంది. పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు. - 8లో



క్రీడలతో మానసికోల్లాసం
విద్యార్థులకు క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 4వ తేదీన జిల్లాకు రానున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్‌లో కలసి ఏఎస్ఎల్ సమావేశం నిర్వహించారు. విమానాశ్రయంలో చేపట్టాల్సిన బందోబస్తుపై సమీక్షించారు. అన్ని శాఖల సమన్వయంతో సీఎం పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.

5న మహిళా వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంబీఏ మీడియా మేనేజ్‌మెంట్ కోర్సులకు ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ పి.సువర్ణలతాదేవి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఏపీ ఐసెట్–2024 లో అర్హత సాధించి, ఇప్పటి వరకు ఏ ఇతర కళాశాలల్లో అడ్మిషన్ పొందని విద్యార్థినులు మాత్రమే ప్రవేశానికి అర్హులని వెల్లడించారు. విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10గంటలకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయానికి రావాలని సూచించారు. ఇతర వివరాలకు మహిళా వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

వేస్ట్ టూ వండర్‌లో వెటర్నరీ విద్యార్థికి ప్రథమ బహుమతి



పీవీవీ సుధీర్

తిరుపతి సిటీ : తుడా ఆధ్వర్యంలో నిర్వహించిన వేస్ట్ టూ వండర్ పోటీలలో వెటర్నరీ కళాశాల విద్యార్థి పీవీవీ సుధీర్‌కు ప్రథమ బహుమతి లభించింది. ఈ మేరకు బుధవారం గాంధీ జయంతి సందర్భంగా కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సుధీర్‌కు రూ.10వేలు నగదు, ప్రశంసాపత్రాన్ని తుడా అధికారులు అందజేశారు. వేస్ట్ పేపర్లు, పాత వస్తువులతో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ చిత్రాన్ని సుధీర్ రూపొందించి ప్రతిభను చాటారు. బహుమతి అందుకున్న విద్యార్థికి అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య అభినందనలు తెలిపారు.

అకడమిక్ కౌన్సిల్ మెంబర్‌గా జగపతిరామయ్య



తిరుపతి సిటీ : తమిళనాడు పశువైద్య విశ్వవిద్యాలయం అకడమిక్ కౌన్సిల్ మెంబర్‌గా డాక్టర్ పి.జగపతిరామయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆ వర్సిటీ రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన 3 ఏళ్ల పాటు కౌన్సిల్ మెంబర్‌గా సేవలందించనున్నారు. ప్రస్తుతం జగపతిరామయ్య తిరుపతి ఎస్వీ వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

6 నుంచి పీజీ, డిగ్రీ కళాశాలలకు దసరా సెలవులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ, పీజీ కళాశాలలకు ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు మంజూరు చేశారు. 14వ తేదీ సోమవారం తరగతులు పున:ప్రారంభమవుతాయని వర్సిటీ అధికారులు తెలిపారు.

నవోదయాలో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న తేదీన జాతీయ స్థాయిలో పరీక్ష నిర్వహించనున్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో 8, 10వ తరగతి చదివే విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి పీజీ అడ్మిషన్లు

తిరుపతి సిటీ : ఎస్వీయూ, మహిళా వర్సిటీలో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు ఏపీపీజీసెట్–2024 రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి ఉత్తర్వులు జారీ చేసింది. రెండో విడత కౌన్సిలింగ్ కోసం ఇప్పటికే దరఖాస్తు చేస్తుకున్న విద్యార్థులకు గురువారం సీట్లు కేటాయించనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు 7లోపు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకుని ప్రవేశం పొందాల్సి ఉంటుంది.

దేదీప్యం.. దివ్యధామం

పవిత్రం.. పరిశుద్ధం



శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణంలో వినియోగించే పవిత్రంగా పరిశుద్ధం చేసి తయారు చేసిన దర్భ చాప, తాడును బుధవారం టీటీడీ అధికారులు ఊరేగింపుగా ఆలయానికి తరలించారు.







తిరుగిరులు దేదీప్యంగా వెలుగొందుతున్నాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు శోభాయమానంగా ముస్తాబయ్యాయి. వైకుంఠనాథుని దర్శనానికి తరలివచ్చే అశేష భక్తులకు సాదర స్వాగతం పలుకుతున్నాయి. విద్యుద్దీప కాంతుల నడుమ దివ్యతేజస్సుతో విరాజిల్లుతున్నాయి. ఈ క్రమంలోనే వేంకటాపతి ఆనంద నిలయానికి ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ మాడ వీధులు ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతున్నాయి. సరికొత్త సొబగులతో ఏడుకొండలస్వామి వైభవాన్ని దశదిశలా వ్యాపింపజేస్తున్నాయి. సుమనోహర సుగంధ సుమాల పరిమళాలతో దేవదేవుని దివ్య చరణాలు మోక్షమార్గంగా భక్తులకు దర్శనమిస్తున్నాయి.

\- తిరుమల

ప్రైవేట్‌గా సైఖతం!

వెంకటగిరి మండలం మొగళ్లగుంట ప్రభుత్వ స్టాక్ పాయింట్‌లో ఇసుక లేని దృశ్యం



- ప్రభుత్వ పాయింట్లలో ఇసుక నిల్ • తమ్ముళ్ల రీచ్‌ల వద్ద నిల్వలు ఫుల్
- అక్రమ తవ్వకాలు.. అమ్మకాలకు ప్రత్యేకంగా కాంట్రాక్టర్లు
- ఎక్కడికక్కడ పర్యవేక్షిస్తున్న టీడీపీ నేతలు
- పచ్చమూక అనుమతి లేకుంటే తప్పని కేసులు
- ఇసుక దొరక్క ఆగిపోతున్న నిర్మాణాలు

"తమ్ముళ్లూ మన ప్రభుత్వం వస్తే ఇసుకను ఉచితంగా ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటా. గుర్తుపెట్టుకోండి.. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇసుక ఫ్రీ'' అని ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఊదరగొట్టారు.

అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఉచితాన్ని కాస్తా అనుచితంగా మార్చేశారు. పేరుకు సర్కారు ఇసుక పాయింట్లు ఏర్పాటు చేశారు. చాటుగా పచ్చమూకను రంగంలోకి దింపేసి ప్రైవేట్ రీచ్‌లు పెట్టించేశారు. ఇక అప్పటి నుంచి వాగులు.. వంకలు.. నదుల్లో సై'ఖతం' మొదలైంది. కూటమి నేతల ధనదాహానికి ఇసుక ఎక్కడికక్కడ అదృశ్యమవుతోంది. ప్రభుత్వ పాయింట్‌లు ఖాళీగా ఉండడంతో భవన నిర్మాణ పనుల కోసం ప్రతి ఒక్కరూ ప్రైవేట్ రీచ్‌లపైనే ఆధారపడాల్సిన దుస్థితి దాపురించింది. అక్కడ టీడీపీ నాయకులు చెప్పిందే రేటుగా మారిపోయింది.

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఇసుక విషయంలో కూటమి ప్రభుత్వం చెప్పింది ఒకటి.. చేస్తున్నది మరొకటి. పార్టీ నాయకుల ప్రయోజనాలే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. పేరుకే ఉచిత ఇసుక. అంతకు అంత డబ్బులు పెట్టందే దొరకడం లేదు. ఉచిత ఇసుక పేరుతో టీడీపీ నేతలకు ప్రభుత్వ విధానం కాసుల వర్షం కురిపిస్తోంది. సర్కారు ఏర్పాటు చేసిన రీచ్‌ల వద్ద ఇసుక అందుబాటులో ఉంచామని చెబుతున్నారు. తీరా వ్యయప్రయాసల కోర్చి వెళితే అక్కడ ఇసుక దొరకడం లేదు. రీచ్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లేకపోవడంతో ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా పది ఆన్‌లైన్ బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపింది. అయితే ఇప్పటి వరకు ఆన్‌లైన్ బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఎక్కడా ఆన్‌లైన్ బుకింగ్ లేదు. ఇసుక లోడింగ్ లేదు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ఆన్‌లైన్ సౌకర్యం ఉన్నా.. 25శాతం ఇసుకను నిబంధనల ప్రకారం విక్రయిస్తుండగా.. 75శాతం ఇసుకను టీడీపీ నేతలే కొనుగోలు చేసి బ్లాక్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

చిత్తూరు జిల్లా

అసెంబ్లీ నియోజకవర్గాలు	టీడీపీ నేతల రీచ్‌లో లారీ ఇసుక ధర (రూ.వేలలో)
1. కుప్పం	రూ.36వేలు
2. పలమనేరు	రూ.26వేలు
3. పుంగనూరు	రూ.32వేలు
4. పూతలపట్టు	రూ.22వేలు
5. చిత్తూరు	రూ.20వేలు
6. గంగాధరనెల్లూరు	రూ.18వేలకుపైనే
7. నగరి	రూ.27వేలు

తిరుపతి జిల్లా..

అసెంబ్లీ నియోజకవర్గాలు	టీడీపీ నేతల రీచ్‌లో లారీ ఇసుక ధర (రూ.వేలలో)
1. తిరుపతి	రూ.23,600
2. చంద్రగిరి	రూ.42,600
3. శ్రీకాళహస్తి	రూ.31,600
4. సత్యవేడు	రూ.19,600
5. సూళ్లూరుపేట	రూ.21,600
6. గూడూరు	రూ.18,600వేలు
7. వెంకటగిరి	రూ.28వేలు

ఏడాదికి రూ.5 కోట్లు

తిరుపతి, చిత్తూరు జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వ రీచ్‌లు, స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసినా అక్కడ ఇసుక లభ్యం కావటం లేదు. టీడీపీ, జనసేన నేతలు ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు రీచ్‌ల వద్ద కావలసినంత ఇసుక దొరుకుతోంది. స్వర్ణముఖి నదీ పరీవాహక ప్రాంతంలో చంద్రగిరి, పాడిపేట, గాజులమండ్యం, పాపానాయుడుపేట, పెనుమల్లం, గోవిందవరం, ముసిలిపేడు, మోదుగులపాళెం, అబ్బాపట్ల పల్లె, పుల్లారెడ్డి కండ్రిగ, అమ్మపాళెం, శ్రీకాళహస్తి, చెంబేడు, కలవకూరు, పెళ్లకూరు, నాయుడుపేట, భీమవరం, మర్లపల్లె, అన్నమేడు, చిట్టమూరు మండల పరిధిలోని గుణపాడు, కోట మండల పరిధిలోని గూడలి, వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం కూడలి, గూడూరు మండలం కైవల్యానది పరీవాహక ప్రాంతంలోని ఇందూరు, పంబలేరు, కాళంగి నదీ పరివాహక ప్రాంతంలో ఇల్లుపూరు, కరుణానది, అరుణానదీ పరీవాహక ప్రాంతం, నీవా నది పరీవాహక ప్రాంతమైన కొత్రకోన, జీడీ నెల్లూరు, వేల్కూరు, ముక్కలతూరు, రాసమరెడ్డిపల్లె, పాతపాలెం, కౌండిన్య నది పరీవాహక ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఈ తవ్వకాలు, అమ్మకాల కోసం అధికారపార్టీ నేతలు ప్రతి నియోజక వర్గానికి ఓ కాంట్రాక్టర్‌కి బాధ్యతలు అప్పగించారు. సదరు వ్యక్తి నియోజక వర్గంలో ఎక్కడైనా, ఎంతైనా ఇసుక తవ్వి విక్రయించుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం ఆ కాంట్రాక్టర్ అధికారపార్టీ నేతకు ఏడాదికి రూ.5 కోట్లు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అర్ధరాత్రి దాటాకే అక్రమాలు

ఇసుక అక్రమ తవ్వకాలన్నీ ప్రతి రోజూ అర్ధరాత్రి దాటాకే జరుగుతున్నాయి. అంతా నిద్రలోకి జారుకున్నాక అక్రమార్కులు నిద్రలేస్తారు. ఆయా ప్రాంతాల్లో భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి వాహనాల ద్వారా స్థానికులకు విక్రయించడంతో పాటు.. కంటైనర్ల ద్వారా చెన్నై, బెంగళూరుకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. మరో వైపు రైతుల అనుభవంలో ఉన్న డీకేటీ భూములను టీడీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించి ఇసుకను తవ్వి విక్రయించేస్తున్నారు. శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజక వర్గాల పరిధిలో సాగులో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టారు. తిరుపతి రూరల్ మండలం పాడిపేట, ఏర్పేడు మండలం పెనుమల్లం వద్ద వెలుగుచూసిన టీడీపీ నేతల బాగోతమే ఇందుకు నిదర్శనం. డీకేటీ పట్టాలు పొందిన రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో టీడీపీ నేతలు దౌర్జన్యంగా భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి వందలాది వాహనాల ద్వారా తరలించేస్తున్నారు. టీడీపీ నేతల అనుమతి లేకుండా ఎక్కడా ఎవరూ ఇసుక తవ్వకాలు చేపట్టకూడదు. ఒక వేళ ఇసుక తవ్వి తరలిస్తుంటే వారిని వెంటాడి భారీగా నగదు వసూలు చేస్తున్నారు. సొమ్ము చెల్లించని వారిపై కేసులు నమోదు చేయిస్తున్నారు.

ఇసుక విక్రయాల్లో తమ్ముళ్ల చేతివాటం ఇదీ..

- వెంకటగిరి మండలం మొగళ్లగుంట వద్ద ప్రభుత్వం ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇసుక లేకపోవడంతో టీడీపీ నేతలు అక్కడకు సమీపంలోనే అక్రమ రీచ్ ఏర్పాటు చేసుకుని టన్ను ఇసుకను రూ.500 చొప్పున యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు.
- సూళ్లూరుపేట నియోజక వర్గం దొరవారి సత్రం మావిళ్లపాడు వద్ద ప్రభుత్వం ఇసుక స్టాక్ పాయింట్‌లో తొలి రెండు రోజులు మాత్రమే ఇసుక లభ్యమైంది.పక్కనే టీడీపీ నేతల డంప్ వద్ద టన్ను రూ.365 నుంచి రూ.500 చొప్పున విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు.
- సత్యవేడు నియోజక వర్గం నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో ఇసుక లేదు. స్వర్ణముఖి నది వద్ద టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన అక్రమ ఇసుక రీచ్‌లో టన్ను రూ.250 చొప్పున విక్రయిస్తున్నారు.
- పిచ్చాటూరు మండలం అడవికోయంబేడులో ప్రభుత్వ స్టాక్ పాయింట్‌లో ఇసుక కరువు. అయితే పక్కనే ఉన్న వాగు నుంచి టీడీపీ నేతలు ప్రతి రోజూ రాత్రి వందకు పైగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇక్కడ టన్ను ఇసుక రూ.400 చొప్పున అమ్మేస్తున్నారు.
- గంగవరం మండలం నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రభుత్వం స్టాక్ పాయింట్‌లో చాలా కాలం నుంచి ఇసుక దొరకడం లేదు. టీడీపీ నేతలు ప్రైవేటుగా ఏర్పాటు చేసుకున్న రీచ్‌ల వద్ద టన్ను ఇసుక రూ.1,500లకు విక్రయిస్తున్నారు.
- చిత్తూరు రూరల్ మండలంలో రెండు ఇసుక పాయింట్లు ఉన్నాయి. ఒకటి దిగువమాసాపల్లె, పాలూరు. ప్రస్తుతం పాలూరు పాయింట్‌లో ఇసుక లేదు. దిగువమాసాపల్లె వద్ద ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకునే అవకాశముంది. అయితే టీడీపీ నేతలే ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసి, ప్రైవేటుగా టన్ను రూ.వెయ్యి చొప్పున అమ్ముకుంటున్నారు.



ఖాళీగా దొరవారి సత్రం మండలం మావిళ్లపాడులో ప్రభుత్వ స్టాక్ పాయింట్



శ్రీకాళహస్తి సమీపంలోని స్వర్ణముఖి నదిలో అక్రమంగా సాగుతున్న ఇసుక తవ్వకం



పిచ్చాటూరు మండలం అడవికోయంబేడులోని ప్రభుత్వ స్టాక్ పాయింట్‌లో ఇసుక లేని దృశ్యం

5 నుంచి అంతరిక్ష వారోత్సవాలు

- ఇస్రో ఆధ్వర్యంలో వివిధ పోటీలు
- విజేతలకు షార్‌లో బహుమతులు



భానుప్రసాద్, జిల్లా సైన్స్ ఆఫీసర్

తిరుపతి ఎడ్యుకేషన్ : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), సతీష్ ధవన్ స్పేస్ సెంటర్(షార్) ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా 5, 7, 8వ తేదీల్లో తిరుపతిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా సైన్స్ ఆఫీసర్, ఇస్రో కో–ఆర్డినేటర్ భాను ప్రసాద్ బుధవారం తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి ప్రోత్సహించేందుకు ఇస్రో ఈ వారోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. 5వ తేదీ ఉదయం పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం సెమినార్ హాల్లో జూనియర్స్ విభాగం (6నుంచి 9వ తరగతి), సీనియర్స్ విభాగం (10నుంచి ఇంటర్) విద్యార్థులకు మల్టీపుల్ చాయిస్ ప్రశ్నల రాత పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం డిగ్రీ, పీజీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, సైన్స్ మోడల్ ఎగ్జిబిషన్ చేపట్టనున్నట్లు వివరించారు. 7వ తేదీ ఉదయం కరకంబాడిరోడ్డులోని ఎస్వీసీఈ ఇంజినీరింగ్ కళాశాలలో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విద్యార్థులకు మల్టీపుల్ చాయిస్ ప్రశ్నల రాత పరీక్ష, మధ్యాహ్నం డిగ్రీ, పీజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు, 8వ తేదీ ఉదయం జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, మధ్యాహ్నం డిగ్రీ, పీజీ విద్యార్థులకు వక్తృత్వ, సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శన పోటీలుంటాయని తెలిపారు. అలాగే ఎస్వీసీఈ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఉదయం 11నుంచి సాయంత్రం 5గంటల వరకు అంతరిక్ష వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 10వ తేదీ శ్రీహరికోటలోని షార్ సందర్శన, బహుమతి ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

తిరుపతి కల్చరల్ : ఎస్వీ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 5తేదీ వరకు పీజీ వైద్య విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ ఇన్‌చార్జి డాక్టర్ తులసీరామ్ తెలిపారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఏటా పీజీ వైద్య విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో వివిధ ప్రాంతాలలో క్రికెట్ టోర్నమెంట్లు చేపడుతున్నామన్నారు. తొలిసారిగా తిరుపతి ఎస్వీయూనివర్సిటీ, అగ్రికల్చరల్ వర్సిటీ మైదానాల్లో టోర్నీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 16 టీమ్‌లు హాజరు కానున్నట్లు వివరించారు.



మాట్లాడుతున్న స్పోర్ట్స్ ఇన్‌చార్జి డాక్టర్ తులసీరామ్

వన్యప్రాణులతోనే అటవీ మనుగడ



మాట్లాడుతున్న డీఎఫ్ఓ శామ్యూల్



ఫ్యాన్సీ డ్రస్ పోటీలో పాల్గొన్న విద్యార్థులతో అధికారులు

తిరుపతి మంగళం : వన్యప్రాణుల సంచారంతోనే అడవుల మనుగడ ఉంటుందని ఎస్వీ జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతుప్రదర్శనశాలలో బుధవారం వన్యప్రాణి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. క్యూరేటర్ మాట్లాడుతూ 8వ తేదీ వరకు వారోత్సవాలు కొనసాగుతాయన్నారు. ఎస్వీ జూ పార్క్‌లోని వన్యప్రాణులను పలువురు జంతుప్రేమికులు దత్తత తీసుకుని వాటి పోషణ చూసుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు వన్యప్రాణులపై చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. అనంతరం వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు.

నేలపట్టు పక్షుల కేంద్రంలో..

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో బుధవారం 70వ వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జంతుజాలాలు, వృక్ష జాతుల రక్షణపై విద్యార్థులకు ఫారెస్ట్ అధికారులు అవగాహన కల్పించారు. సూళ్లూరుపేట డీఎఫ్ఓ శామ్యూల్ మాట్లాడుతూ అంతరించిపోతున్న జంతువులను, వృక్షాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ నరసింహారావు, ఎఫ్ఎస్ఓ బాలయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం పాలసీపై మహిళల నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

తిరుపతి కల్చరల్ : ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన మద్యం పాలసీలో మహిళలు నిరసన తెలిపారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని ఆందోళనకు దిగారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జయంతి, పి.సాయిలక్ష్మి మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి అధికంగా మద్యం షాపులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. ప్రజలను మత్తులో ముంచేందుకు ప్రభుత్వమే యత్నించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన మద్యం పేరిట ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి సొమ్ము చేసుకోవాలనుకోవడం హేయమని మండిపడ్డారు. తిరుపతిని మద్య రహిత నగరంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తిరుమల లడ్డూ గురించి మాట్లాడే నాయకులకు తిరుపతిలో మద్యాన్ని ఏరులా పారిస్తే అపవిత్రం కాదా అని ప్రశ్నించారు. పుట్టపర్తి, షిరిడీ వంటి ప్రాంతాల్లో మద్యాన్ని నియంత్రించారని వెల్లడించారు. దీనికి బీజేపీ, టీడీపీ , జనసేన నేతలు దీనికి సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత, ఐద్వా నాయకులు కోమలమ్మ, సాయిదీప్తి, లత, బుజ్జమ్మ, రాజు, జేవీవీ నేత వెంకటరమణ పాల్గొన్నారు.


అంత్యక్రియలకు పెద్దసంఖ్యలో హాజరైన పుంగనూరు వాసులు (ఇన్‌సెట్) అశ్వియఅంజుమ్ (ఫైల్)


అశ్వియ అంజుమ్ మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న పోలీసులు

మానవత్వం మంటగలిసింది. ముక్కుపచ్చలారని పసిబిడ్డను పైశాచికత్వం కబళించింది. అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులను తీరని శోకంలో ముంచేసింది. పుంగనూరులో ఏడేళ్ల బాలిక అదృశ్యమైన ఘటన చివరకు విషాదాంతంగా మారింది. నాలుగు రోజుల ఎదురుచూపులకు నిర్వేదమే మిగిలింది. బుజ్జితల్లిని విగతజీవిగా సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో చూసి ప్రతి ఒక్కరి హృదయం చలించిపోయింది. అభం శుభం తెలియని బాలికను పాశవికంగా హతమార్చడంపై ఆవేదనతో నిండిపోయింది.

కన్నీటిసంద్రం

పుంగనూరులో విషాదం

- ఎస్ఎస్ ట్యాంకులో తేలిన బాలిక మృతదేహం
- నాలుగు రోజుల పోలీసుల దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు దొరకని వైనం

పుంగనూరు : పట్టణంలోని యూబీ కాంపౌండుకు చెందిన అజ్మతుల్లా కుమార్తె అశ్వియఅంజుమ్ (7) గత నెల 29న రాత్రి 7 గంటల సమయంలో పక్కింటిలో ఆడుకునేందుకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధుమిత్రులు గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేశారు. విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ మణికంఠ చందవోలు పుంగనూరుకు చేరుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో పోలీస్ జాగిలాలను చిత్తూరు, రాయచోటి నుంచి తెప్పించారు. బాలిక ఇంటి నుంచి ఉబేదుల్లా కాంపౌండులోని పలు వీధుల్లో పరుగులు తీసిన పోలీస్ జాగిలాలు చెంగలాపురం రోడ్డులోని ముళ్ల పొదల వద్ద ఆగిపోయాయి. తిరిగి రెండో సారి ఇంటి నుంచి జాగిలాలతో పరిశీలన చేపట్టారు. రెండవ సారీ అదే ప్రాంతంలోకి వచ్చి ఆగిపోవడంతో పోలీసులు, వందల సంఖ్యలో ముస్లిం యువకులు కలిసి ముళ్లపొదల్లో గాలింపు చేపట్టారు. కానీ బాలిక ఆచూకీ లభించలేదు. పట్టణంలోని సీసీ కెమెరాలలోని డేటాను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. మంగళవారం రాత్రి అనంతపురం డీఐజీ హిమోషి బాజ్‌పాయ్ పుంగనూరు చేరుకుని ఎస్పీతో కేసు దర్యాప్తుపై చర్చించి, పలు సూచనలు చేసి వెళ్లారు.

బాలిక ఒంటిపై గాయాలు

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో శవమై పడి ఉన్న అశ్వియ అంజుమ్ దుస్తులపై రక్తపు మరకలు, ఒంటిపై గాయాలు ఉన్నట్లు శవాన్ని వెలికితీసిన ముస్లిం యువకులు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో బాలికను కిడ్నాప్ చేసి చెంగలాపురం ముళ్ల పొదల్లోకి తీసుకొచ్చి అక్కడ బాలికపై అత్యాచారం చేసి, హత్య చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో పడవేసి ఉంటారని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదే ప్రాంతంలో పోలీస్ జాగిలాలు రెండు సార్లు వచ్చి ఆగిపోవడం గమనార్హం. దీనిని బట్టి దుండగులు బాలికను అక్కడికి తీసుకొచ్చి తరువాత కారులో కానీ, ఆటోలో కానీ వెళ్లి ఉంటారని, దీని కారణంగా జాగిలాలు ఆచూకీ కనుగొనడంలో విఫలమయ్యాయన్న భావన వ్యక్తమవుతోంది.

ఆర్థిక లావాదేవీలైతే..

అజ్మతుల్లా వడ్డీ వ్యాపారిగా ఉన్నప్పటికీ లావాదేవీల వ్యవహారమైతే బాలికను కిడ్నాప్ చేసి సొమ్ము డిమాండ్ చేసి ఉండేవారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్తవాళ్లు బాలికను తీసుకెళ్లే అవకాశం లేదని ఆ ప్రాంత వాసులు అంటున్నారు. తెలిసినే వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని ఆరోపిస్తున్నారు.

అశ్రునయనాలతో అంత్యక్రియలు

చిన్నారి అశ్వియఅంజుమ్ మృతదేహానికి స్థానిక ఆస్పత్రిలో ఎస్పీ మణికంఠ చందవోలు, జేసీ విద్యాధరి ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం పోస్టుమార్టం నిర్వహించింది. ఆస్పత్రికి సమీపంలోని ముస్లింల శ్మశాన వాటికలో బాలిక అంత్యక్రియలు నిర్వహించారు. వేలాది మంది ముస్లింల కన్నీటితో బాలికకు వీడ్కోలు పలికారు. ఈ ఘటన స్థానికుల గుండెలను కలచివేసి పట్టణాన్ని విషాదంలో ముంచింది.

గంజాయి బ్యాచ్ పనేనా?

పట్టణంలోని చెంగలాపురం, భగత్‌సింగ్ కాలనీ, దోబీ కాలనీ, కోనేటిపాళెం, ఎన్ఎస్.పేట ప్రాంతాల్లో గంజాయి, మత్తు పదార్థాలు అధికంగా లభిస్తున్నాయి. యువత మత్తుకు బానిసలవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యువకులు మత్తులో బాలికను కిడ్నాప్ చేసి, చెంగలాపురం ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసి, హత్య చేసి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ కోణంలో దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే, ఎంపీ పరామర్శ

ఈ విషాదకర ఘటన సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఫోన్ ద్వారా అజ్మతుల్లా కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాలిక మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

దర్యాప్తు ఇలా...

బాలిక అశ్వియఅంజుమ్ అదృశ్యమైందనే కోణంలో పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. బాలిక తండ్రి అజ్మతుల్ల వడ్డీవ్యాపారి కావడంతో పోలీసుల దర్యాప్తు ఆ కోణంలో సాగింది. కానీ పోలీసులకు నాలుగురోజుల్లో చిన్న క్లూ కూడా లభించలేదు. చిన్నారిని కిడ్నాప్ చేసిన ఆగంతకుల ఆచూకీని పోలీసులు కనిపెట్టలేకపోయారు. పోలీసుల దర్యాప్తు పట్టణానికే పరిమితమైంది. కానీ చిన్నారి ఇంటికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో చిన్నారి మృతదేహం లభించడం పలు అనుమానాలకు దారితీస్తోంది.


పుంగనూరులో ఆస్పత్రి వద్ద కుటుంబీకుల రోదనలు


బాలిక తండ్రి అజ్మతుల్లాను పరామర్శిస్తున్న చిత్తూరు ఎస్పీ మణికంఠ

కోలాహలం.. జెండా ఉత్సవం


హనుమంతుడి ఫొటో తీసుకెళుతున్న దృశ్యం

చిల్లకూరు : పట్టణంలోని గాంధీ బొమ్మ ప్రాంతంలోని కలశ కొట్టు నుంచి బుధవారం జెండా ఉత్సవం ప్రారంభమైంది. అనంతరం మిగిలిన ప్రాంతాల్లోని జెండాలను పట్టణంలో కోలాహలంగా ఊరేగించారు.. ఈ క్రమంలో గమ్మళ్లపాళెం, బజారు వీధి, కుమ్మరవీధి, జాంద్రపేట, బొడ్డు చౌక, కర్నాల వీధి, ఐసీఎస్ రోడ్డు, మిట్టపాళెం తదితర ప్రాంతాలను విద్యుద్దీపాలతో కనులపండువగా అలంకరించారు. తెనాలి తీన్‌మార్ బ్యాండ్లతో పాటుగా డీజేలు ఏర్పాటు చేయడంతో యువత ఉత్సాహంగా ఉర్రూతలూగారు. ప్రత్యేకంగా భేతాళ నృత్యాలు, తూర్పువీధిలో నరసింహస్వామి ఉగ్ర రూపం అందరిని ఆకట్టుకున్నాయి. జెండ పండుగ సందర్భంగా గూడూరు కిక్కిరిసింది. డీఎస్పీ రమణకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజేతలకు ట్రోఫీ బహూకరిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ప్రతిష్టాత్మక ఇంటర్ కాలేజీ ఇన్విటేషన్ టోర్నమెంట్ (సమయోగ్-2024)లో భాగంగా విజేతలకు ట్రోఫీలు, పతకాలు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. డైరెక్టర్ మాట్లాడుతూ టోర్నీకి 13 ప్రతిష్టాత్మక కళాశాలల నుంచి 700 మంది క్రీడాకారులు హాజరైనట్లు వెల్లడించారు. టైకా స్పోర్ట్స్ వేర్, డెకాథ్లాన్, స్పోర్ట్స్ బొనాంజా ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించినట్లు చెప్పారు. క్రీడా ఔత్సాహికులు తమ సామర్థ్యాలను ప్రదర్శించడం, బలోపేతం చేయడానికి ఇలాంటి టోర్నమెంట్‌లు వేదికగా ఉపయోగపడుతాయని వివరించారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎస్ఎస్‌మూర్తి, ఉదయ్‌కుమార్, సుకుమారన్, అయ్యప్పన్, ప్రణవేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు తడ ఐటీఐలో జాబ్ మేళా

తడ: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 4వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రీసిటీలోని బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలకు చేపట్టే ఈ మేళాలో 8వ తరగతి పైన విద్యార్హత, పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన యువతీ, యువకులకు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ జెరాక్స్‌తోపాటు బయోడేటా, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న అడ్మిట్ కార్డు తీసుకురావాలని కోరారు. వివరాలను 9154449677 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మహాత్ముని త్యాగాలను మరువలేం


గాంధీజీకి నివాళులర్పిస్తున్న కలెక్టర్, కమిషనర్

తిరుపతి అర్బన్ : జాతిపిత మహాత్మాగాంధీ త్యాగాలను మరువలేమని కలెక్టర్ వెంకటేశ్వర్ కొనియాడారు. బుధవారం గాంధీ జయంతిని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్‌ఓ పెంచల కిషోర్, డీఈఓ శేఖర్, పలువురు జిల్లా అధికారులు నివాళులర్పించారు. అనంతరం తిరుపతి బస్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో కమిషనర్ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు. అలాగే తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో గాంధీ జయంతిని జరుపుకున్నారు. ఏఓ ఝాన్సీ లక్ష్మి, నరేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు. తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలోను గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు. డీటీ కిరణ్‌కుమార్ ఉన్నారు.

ముక్కంటి ఆలయ ఏఈఓ సస్పెన్షన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఏఈఓ ధనపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోశాల నిర్వహణలో లోపాలు, ఆలయంలో వివిధ వస్తువులను విక్రయించుకునేందుకు శివకామేశ్వరి ట్రేడర్స్‌కు అక్రమ అనుమతులతోపాటు నిబంధనలను ఉల్లంఘించినందున సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళా రైతుపై టీడీపీ నేతల దౌర్జన్యం

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం దీన్‌దార్లపల్లె పంచాయతీలో మహిళా రైతు చిట్టెమ్మపై టీడీపీ నేతలు బుధవారం దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఆమె భూమిలోకి అక్రమంగా ప్రవేశించి కూసాలను విరిచేశారు. సాగు చేస్తున్న టమాట పంటను నాశనం చేశారు. డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశారు. దీనిపై బాధితురాలి భర్త సుబ్రమణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమ్మను కాపాడాలని వేడుకోలు

తిరుపతి కల్చరల్ : బతుకు దెరువు కోసం మస్కట్‌కు వెళ్లిన తన తల్లి ఇంద్రాణి మోసపోయి అక్కడ కష్టాలు పడుతోందని, ఆమెను కాపాడాలని తారకరామనగర్‌కు చెందిన జాన్సన్ వేడుకున్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 7 నెలల క్రితం చెన్నైకి చెందిన ఏజెంట్ మాటలు నమ్మి తన తల్లి వెళ్లిందన్నారు. 3నెలలు తమతో ఫోన్‌లో మాట్లాడుతుండేదని, తర్వాత ప్రమాదంలో ఉన్నానని తమకు వీడియో పంపిందని, ప్రస్తుతం ఫోన్ కూడా పని చేయలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి తమ తల్లిని ఇంటికి చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

క్రమశిక్షణతో విధుల నిర్వహణ

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి, అనంతపురం రేంజ్ డీఐజీ షేముషి బాజ్ పాయ్, ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టం చేశారు. బుధవారం వివిధ జిల్లాల నుంచి ఉత్సవాల బందోబస్తుకు విచ్చేసిన పోలీసులతో వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని కోరారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే చిన్నారులు, వయోవృద్ధులకు జియోట్యాగింగ్ చేయాలన్నారు. చోరీలు జరగకుండా క్రైమ్ పార్టీలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్‌కు చర్యలు చేపట్టాలని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు 5,145 మందితో భద్రత నిర్వహిస్తున్నామన్నారు. గరుడ వాహనం రోజున 1,264 మందిని నియమిస్తున్నామని వెల్లడించారు. కమాండ్ కంట్రోల్ ద్వారా సీసీ కెమెరాలను నిరంతం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్ఓ శ్రీధర్, ఏఎస్పీలు రవిమనోహరాచారి నాగభూషణరావు రామకృష్ణ శ్రీనివాసరావు, డీఎస్పీ విజయ్ శేఖర్ పాల్గొన్నారు.

టెండర్లలో అవకతవకలపై ఫిర్యాదు

రేణిగుంట : తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు సరఫరా చేసే కోడి గుడ్లు, చికెన్‌కు సంబంధించి టెండర్ల ప్రక్రియ బుధవారం సాయంత్రం ముగిసింది. అయితే టెండర్లలో అవకతవకలు జరిగాయని వెంటనే విచారణ చేపట్టాలని నెల్లూరు జిల్లా ఐటీడీఏ పీఓకు చిత్తూరు, తిరుపతి టెండరుదార్లు ఫిర్యాదు చేశారు. నిత్యావసర సరుకుల సరఫరా టెండర్ల కోసం సెప్టెంబర్ 5వ తేదీన టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. టెండర్ల పాల్గొన్న వారికి 3 ఏళ్ల అనుభవం, జీఎస్టీ సర్టిఫికెట్ జతపరచాలని వెల్లడించారు. అయితే టీడీపీ నాయకులకు ఏకపక్షంగా టెండర్ అప్పగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. టెండర్ ప్రక్రియను రద్దు చేసి పారదర్శకంగా జరిపించాలని వారు కోరారు.

సినీ ఫక్కీలో ఇసుక స్మగ్లింగ్


పోలీస్ స్టేషన్ వద్ద ఇసుక లారీ

రేణిగుంట : పుష్ప సినిమా తరహాలో చేపట్టిన ఇసుక స్మగ్లింగ్‌కు పోలీసులు చెక్ పెట్టారు. ఏర్పేడు మండలం పాపానాయుడు పేట మార్గం నుంచి మంగళవారం ఒక లారీ రేణిగుంట మీదుగా బెంగుళూరుకు బయలుదేరింది. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు జీపాళెం సమీపంలో లారీని పట్టుకున్నారు. పైన కప్పిన పట్టను విప్పి చూడగా వేరుశనగ, రంపపు పొట్టు కనిపించింది. పొట్టును కొద్దిగా తొలగిస్తే లోపల ఇసుక దర్శనమిచ్చింది. ఈ మేరకు గాజులమండ్యం పోలీసులు లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

పచ్చనేతల భూమేత!

ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు పచ్చనేతలు పాగా వేసేస్తున్నారు. అధికారంలోకి వచ్చింది మొదలు కార్యకర్త నుంచి ముఖ్య నాయకుల వరకు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. వందలాది ఎకరాలను యథేచ్ఛగా ఆక్రమించేసుకున్నారు. యుద్ధప్రాతిపదికన ఆయా భూములను చదును చేయించేసి సాగుకు అనుకూలంగా మార్చేసుకుంటున్నారు. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. చివరకు కబ్జాకాండపై వార్త రాసిన విలేకర్లపై సైతం దాడులకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. విమర్శలు వెల్లువెత్తుతున్నా పట్టించుకోకుండా పరోక్షంగా అక్రమార్కులకు సహకరిస్తున్నారు.

- అధికారం అండతో రెచ్చిపోతున్న తమ్ముళ్లు
- ఇష్టారాజ్యంగా కబ్జాలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు


తిప్పిరెడ్డిగారిపల్లె లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

భాకరాపేట : చంద్రగిరి నియోజకవర్గంలో వందలాది ఎకరాలను టీడీపీ నేతలు తమ కబంధ హస్తాల్లోకి తీసుకుంటున్నారు. యథేచ్ఛగా భూదోపిడీకి పాల్పడుతున్నారు. అందులో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లెలోని 1727 సర్వే నంబరులోని భూమిపై పచ్చ నేతల కన్ను పడింది. ఇంకేముంది యంత్రాలు పెట్టడం ముళ్లపొదలు తొలగించి వ్యవసాయానికి అనువుగా మార్చేస్తున్నారు. సెలవు రోజు వస్తే చాలు కబ్జా భూముల్లో యంత్రాలను పరుగులు తీయిస్తున్నారు. భాకరాపేట రెవన్యూలో 329 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిపై పదుల సంఖ్యలో టీడీపీ నేతలు పడ్డారు. దేవరకొండ రెవెన్యూ గ్రామంలో చెరువుల ఆక్రమణపై వార్తలు రాసిన మహిళా విలేకరి ఇంటిపై దాడి చేశారు. తిప్పిరెడ్డిగారిపల్లె రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న భూఆక్రమణలు గురించి తహసీల్దార్‌ను వివరణ అడిగిన విలేకర్లపై అక్రమంగా కేసులు నమోదు చేశారు. ఎర్రావారిపాళెం మండలం యల్లమందలో సర్వేనంబరు 692లోని 15 ఎకరాల ప్రభుత్వ భూమిని భారీ యంత్రాలు పెట్టి చదును చేశారు. అలాగే అక్కడి మట్టిని తవ్వేసి అనుమతులు లేకుండా తరలిస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీఆర్ఓ, వీఆర్ఏలు కార్యాలయాలకే పరిమితం కావడంతో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో కూడా రెవెన్యూ అధికారులకు తెలియడం లేదు. ఎవరైన అధికారులు దృష్టికి తీసుకువస్తే వెంటనే కబ్జారాయుళ్లకు సమాచారం అందించేస్తున్నారు. దీంతో గ్రామంలో ఘర్షణలు తలెత్తుతున్నాయి. బాధితులపైనే తప్పుడు కేసులు నమోదవుతున్నాయి.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు ..

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవు. సర్కారు ఆస్తులను కాపాడేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. క్షేత్రస్థాయిలో కబ్జాలపై కట్టుదిట్టంగా నిఘా పెడతాం. ఇప్పటికే ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటాం.

– జనార్దన్‌రాజు, తహసీల్దార్, చిన్నగొట్టిగల్లు